

# హాస్య వల్లరి



## నెలనెలా నవ్వుల పండగ

**కామెడీ క్లబ్ కథలు**

మల్లాది వెంకటకృష్ణమూర్తి

**ఒకామె** షాపులోకి వచ్చి అన్ని వెరైటీలు చూసిన తర్వాత ఏదో అడిగింది.

"ఇక్కడ లేవండి..ఇప్పట్లో వచ్చే అవకాశం లేదండీ.." చెప్పాడు సేల్స్‌మేన్.

దూరాన్నుంచీ ఆ మాటలు విన్న షాపు యజమానికి కోపం వచ్చింది.

వెంటనే జోక్యం చేసుకుని, ఆమెతో అన్నాడు.

"నిన్ననే అయిపోయాయండీ. ఆర్డరిచ్చాం. రెండు రోజుల్లో రావచ్చు.."

ఆమె వెళ్ళిపోయాక సేల్స్‌మేన్‌తో చెప్పాడు యజమాని

"ఏది అడిగినా లేదని చెప్పకూడదు. ఆర్డరు ఇచ్చామని చెప్పాలి. ఇంతకీ ఏం అడిగిందామె?"

"ఈ వూళ్ళో వర్షాలు రావడం లేదా అని అడిగింది సార్.."

చల్లగా చెప్పాడు సేల్స్‌మేన్..!!

★★★★

చౌచౌ... **ఏరుకొచ్చిన నవ్వులు**

"నగరంలో దొంగతనాలెక్కువయ్యాయి. ఏమేం జాగ్రత్తలు తీసుకోవాలో మాట్లాడుకుంటున్నారు ముగ్గురు పెద్ద మనుషులు.

"నేను రివాల్వరు దగ్గరుంచుకుంటున్నాను" అన్నాడొకాయన.

"మా యింట్లో అలారమ్ సిస్టమ్ పెట్టించాను. కొత్తవాళ్ళెవరయినా గుమ్మం దాటి అడుగు పెడితే చాలు అన్ని గదులలోనూ గణగణమని గంటలు మోగుతాయి. ఠారెత్తి పారిపోతాడు" గర్వంగా చెప్పాడు రెండో ఆయన.

మూడో పెద్దమనిషి నవ్వుతూ మౌనంగా ఉండిపోయాడు.

"మీరు మాట్లాడరేం? మీరు కూడా ఏదో ఏర్పాటు చేసుకునుండాలే" ప్రశ్నించారు మిగతా ఇద్దరు.

"నాకు ఆరుగురు చిన్న పిల్లలున్నారు. ఇంట్లో ఈగ కదిలినా మెలుకువ వచ్చేస్తుంది. దొంగనుకూడా వాళ్ళతోపాటు బాత్‌రూమ్ కి తీసుకెళితే సరి."

"అమ్మా! మనింటికెదురుగా ఉన్న వాళ్ళబ్బాయి బాగా చదువుకున్నాడు. చక్కగా ఉంటాడు మంచి కుర్రాడు కదమ్మా?"

"చూసిందల్లా మంచిదని అనుకోడానికి వీల్లేదే. మా పెళ్ళికాక ముందు మీ నాన్నకూడా అలాగే కనబడేవారు నాకు."

విశాఖపట్టణంలో నిత్యావసర వస్తువులకు క్యూలు రెండేసి ఫర్లాంగులుంటున్నాయి. ఒకావిడ కిరసనాయిలు కోసం క్యూలో నిలబడింది. మర్నాడు సాయంత్రానికి ఆవిడ వంతు వచ్చేసరికి కిరసనాయిలు ధర లీటరుకి ఇరవైపైసలు పెరిగిపోయింది.

"నేను పాతధర ఉండగా క్యూలో నిలబడ్డాను. ఆ ధరకే నాకు పోయాలి" పెద్ద గొడవ ప్రారంభించింది. మాటా మాటా పెరిగిపోయాయి.

వెనక నిలబడినాయన ఓపిక పట్టలేక –

"అమ్మా! మీరు మనసు రాజీ చేసుకుని కొనేలోపుగా ధర ఇంకో పదిపైసలు పెరుగుతుంది. మీరు మాట్లాడకుండా ఇప్పుడే తీసుకోవడం ఉత్తమం" అన్నాడు.

పనిమనిషిని కోప్పడుతొందొక ఇల్లాలు.

"రాను రాను నీకు బద్దకం ఎక్కువయి పోతోంది. ఒక్కపని కూడా తిన్నగా చెయ్యడంలేదు. నువ్వు మరో బుద్ధిమాలినదానివయిపోయావు. ఛఛ."

పనిమనిషి చాలా నెమ్మదిగా సమాధానం చెప్పింది –

"ఛఛ లెందుకు. నువ్వు చెప్పింది నిజమేనమ్మా. బుద్ధిలేనిదాన్ని కాబట్టే నీ ఇంట్లో పన్నెండేళ్ళనుంచి పనిచేస్తున్నాను."

తన ప్రియురాలి తమ్ముడు పదేళ్ళవాణ్ణి పక్కకు పిలిచాడు ఒక యువకుడు.

"ఒక పని చేస్తావా?"

"ఏమిటో చెప్పు."

"మీ అక్కయ్య జుట్టులో ఓ వెంట్రుక కావాలి నాకు. తాయెత్తు కట్టించుకుంటాను. తెచ్చి పెట్టావంటే నీకు రూపాయిస్తాను"

"అలాకాదు అయిదు రూపాయిలియ్యి. ఆ వెంట్రుకకు మా అక్క రాసుకునే రంగు కూడా రాసి తెచ్చిస్తాను. ఏం?"

"వాడు తెలివి తక్కువ వాడేకాదు. మూర్ఖాగ్రేసరుడు నంబర్ వన్"

"ఎందుకని అలా అంటున్నావు?"

"పత్రికలో చదివాడు – 'వాంటెడ్ మాన్ ఫర్ రాబరీ ' అని వార్త. వెంటనే గబగబా ఒక అప్లికేషన్ రాసి పోస్టు చేశాడు..."

ఒక కార్మిక నాయకుడు తన మిత్రుడితో గోలపెట్టాడు.

"మా ఆవిడ మరీ ఏకుమేకై పోయింది. ప్రతి విషయంలోను అడ్డదిడ్డంగా మాట్లాడుతోంది. ఏం చేయాలో బోధపడ్డంలేదు"

వివరాలు అడిగాడు మిత్రుడు. లేబర్ లీడర్ కొన్ని సంఘటనలు చెప్పాడు.

"ఆవిడన్న దాంట్లో తప్పేమీ కనబడలేదే నాకు. నువ్వు అపార్థం చేసుకుంటున్నావు. అంతే" తన అభిప్రాయం చెప్పాడు మిత్రుడు.

"ప్చ్..ప్చ్. నువ్వు కూడా యజమానుల తరపునే మాట్లాడుతావనుకోలేదు."

ప్రతి నవలకు, నాటకానికి సాధారణంగా ఒక షరా ఉంటుంది.

"ఇందులో పాత్రలు, సంఘటనలు కల్పితాలు. ఎవరినీ ఉద్దేశించి వ్రాయబడలేదు."

ఇటీవల కాలంలో ఊకదంపుగా వెలువడిన నవలలను అతిగా చదువుతున్న ఒక ముగ్ధమనోహరికి ఆ షరాను చూసినప్పుడల్లా అరికాలిమంట నెత్తికెక్కి అరుస్తుంది.

"ఈ సంగతి వేరే చెప్పాలేంటి? కల్పితాలు కాబట్టే ఇంత చచ్చుగా ఉన్నాయి. ఈ రాసేవాళ్ళ ఊహాశక్తి ఎంత అధ్వానంగా ఉందో చూస్తే తెలియడంలా. ఈ పిచ్చి అలవాటు ఎందుకు మానరు?"

ఇద్దరు మందు భాయిలు ఒకే చోట పనిచేస్తున్నారు. సాయంత్రం ఆరుదాటిన తర్వాత వాళ్ళ లోకమే వేరు. మర్నాడు ఉదయం ఆ కిందటి రోజు సంగతులు నెమరు వేసుకోడం వాళ్ళకు అలవాటు.

"ఒరేయ్ నిన్న కాస్త చుక్క ఎక్కువయింది నాకు. చార్మినార్ అమ్మేశాను తెలుసా?"

"ఓశ్.. అంతేగదా! అయినా నువ్వెందుకురా అంత బాధ పడ్తావ్?"

"ఓరి పిచ్చోడా! ఆ కొనుక్కున్నది నువ్వేగదరా! మనకెంత నష్టమో ఆలోచించు.

ఒక కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగి కాషియర్ దగ్గరకెళ్ళి, తనకందిన నెలజీతం కవరు టేబుల్ మీద పెట్టాడు.

"జీతం తక్కువిచ్చారు"

కాషియర్ కవరులో నోట్లు తీసి లెక్కపెట్టి, "అవును. ఇరవై రూపాయలు తగ్గింది" అంటూ లెడ్జర్ తీసి చూశాడు.

"మిస్టర్ కిందటి నెల నీకు ఇరవై రూపాయలు ఎక్కువిచ్చాము .అప్పుడొచ్చి చెప్పలేదే నువ్వు?"

"ఒకసారి మీరు తప్పుచేస్తే పోనీలే అని సర్దుకున్నాను. వరుసగా మీరిలా తప్పులు చేస్తుంటే ఎలా సహించగలను?"

COMMENTS